లబ్ధిదారులందరికీ న్యాయం



గడప గడపకు మన ప్రభుత్వంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): లబ్ధిదారుందరికీ న్యాయం చేయడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు రాజు) అన్నారు. అచ్యుతాపురం మండలంలోని మడుతూరులో మూడో రోజు గడప గడపలో భాగంగా శనివారం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించే విషయంలో ఎటువంటి వివక్ష ఉండదన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని వర్గాలకు చెందిన అర్హులకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. పేదలందరికీ ఇళ్లు అందించేందుకు చేపడుతున్న పథకాలు విజయవంతంగా అమలు అవుతున్నాయని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి స్థానికులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నవరత్నాల కర పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబురాజు తన మానవత్వం చాటుకున్నారు. చిన్నప్పుడే తల్లిని కోల్పోయి, అనారోగ్యంతో తండ్రి ఉండడంతో అమ్మమ్మ వద్ద పెరుగుతున్న ఇద్దరు చిన్నారులను చూసి వారి కోసం పది వేల రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాంబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, పార్టీ అధికార ప్రతినిధి పిన్నంరాజు వాసు, గ్రామ సర్పంచ్ మోటారు సంజీవి, ఎంపీటీసీ శనివాడ జువ్వాల నాయుడు, గ్రామ పార్టీ అధ్యక్షుడు నల్లపురెడ్డి శ్రీనివాస్, పిల్లి గోవింద్, తోట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రంగుల నవ వసంతం



నూతన సంవత్సరానికి స్వాగతం పలికే కార్యక్రమంలో భాగంగా మధుబాల వేసిన రంగవల్లికలు అందరినీ ఆకట్టుకున్నాయి.
(మునగపాక)

నేడు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాబూరావు

ఎస్.రాయవరం : న్యూ ఇయర్ వేడుకలు పురస్కరించుకుని ఆదివారం పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద అందుబాటులో ఉంటున్నట్టు చెప్పారు. ఉదయం 7.30 గంటల నుంచి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు.

లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

కోటవురట్ల : రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు నిర్మించుకునేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తోందని ఇదే విషయమై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారిణి ఉదయశ్రీ సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా పి.తంగేడు, లింగాపురం గ్రామాల్లోని వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్లను శనివారం పరిశీలించారు. అక్కడి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కరుణ, పీఆర్ జేఈ వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన తప్పనిసరి

కోటవురట్ల : రాజ్యాంగం ప్రతి పౌరుడికి కొన్ని హక్కులు కల్పించిందని, వాటిపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని తహసీల్దారు జానకమ్మ అన్నారు. కైలాసపట్నంలోని సచివాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం శనివారం నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ హక్కులకు భంగం కలిగినపుడు ప్రశ్నించే అధికారం ఉంటుందన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులతో గౌరవంగా జీవించే అవకాశం కలుగుతుందన్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు వి.వెంకటలక్ష్మి, వార్డెన్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

న్యాయబద్ధమైన డిమాండ్లు పరిష్కరించాలి

రాంబిల్లి: నేవీ నిర్వాసితుల ధర్నా 62 రోజులకు చేరుకుంది. వాడనర్సాపురం, కొప్పుగొండుపాలెం, కొత్తపట్నం, నేవీ పునరావాసకాలని, వాడపాలెం, గోవిందపాలెం, చినకవలాపల్లి, కొత్తపేట గ్రామాల ప్రజలు ధర్నాలో పాల్గొన్నారు. తమ న్యాయబద్ధమైన డిమాండ్లు పరిష్కారం చేయాలని నిర్వాసితులు కోరారు.

పాఠశాలలో ఉత్సాహంగా న్యూ ఇయర్ వేడుకలు

మునగపాక : మునగపాక ప్రగతి పబ్లిక్ స్కూల్‌లో నూతన సంవత్సర ఆహ్వాన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.ఉపాధ్యాయులు, విద్యార్థులు 2022కు గుడ్‌బై చెబుతూ 2023కు స్వాగతం పలికారు. విద్యార్థులతో నిర్వహించిన హ్యాపీ న్యూ ఇయర్ ఆకారం అకట్టుకుంది.

ఐక్యతతో పనిచేయండి



ఏపీటీఎఫ్ క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : ఉపాధ్యాయ సంఘాల్లో ఉన్న ఉపాధ్యాయులు అంతా ఐక్యంగా పని చేయాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయంలో శనివారం రాత్రి ఏపీటీఎఫ్ న్యూయర్ క్యాండర్ ఉపాధ్యాయ సంఘ నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చారన్నారు. నాడు నేడు తో ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయన్నారు. దానికి దీటుగా పాఠశాలలో విద్యా బోధన జరిగేలా ఉపాధ్యాయులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండలశాఖ ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట అధ్యక్షుడు కర్రి ధర్మారావు, డి.కొండలరావు, కిల్లాడ శ్రీను, కార్యదర్శులు జి.సునీల్, అప్పలరాజు, మోహన్‌గాంధీ పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

నక్కపల్లి : జాతీయ రహదారిపై శనివారం రెండు బైక్‌లు ఒకదానికొకటి ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. గొడిచర్ల గ్రామం నుంచి జాతీయ రహదారిపైకి వస్తున్న బైక్‌ను తు నినుంచి గొడిచర్ల వైపు వెళ్తున్న మరో బైక్ ఢీకొంది, ఈ ప్రమాదంలో నూకరాజు, రాము అనే ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో తుని ఏరియా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఏపిఓ ఈశ్వరరావు

నక్కపల్లి : మండలంలో న్యాయంపూడి గ్రామానికి చెందిన కొత్తల నాగేశ్వరరావు, ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ డిసెంబరు 19న అనారోగ్యంతో మరణించారు. వీరి కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది సుమారు రూ.30వేలు సేకరించారు. ఈ నగదు సాయాన్ని శనివారం మృతుడు కుటుంబ సభ్యులు ఏపీవో ఈశ్వరరావు తదితరులు అందజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జగన్ ప్రభుత్వం వచ్చాకే ప్రజలందరికీ సంక్షేమం



ప్రభుత్వ సంక్షేమ పథకాలపై లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : సంక్షేమ పథకాల సారధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కొత్త రేవు పోలవరం సచివాలయం పరిధిలో మూడో రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడపగడపకూ వెళ్లిన ఎమ్మెల్యే ప్రభుత్వం నుంచి ఎటువంటి లబ్ధి పొందారో వారిని ఆరా తీశారు. బీసీ నేస్తం, డ్వాక్రా రుణమాఫీ, అమ్మవడి, రైతు భరోసా, మత్స్యకార భృతి వంటి పథకాలు అందాయని సంతోషంగా ఎమ్మెల్యేకు చెప్పారు. ఇవన్నీ ఎవరి వల్ల సాధ్యం అయ్యాయని ఎమ్మెల్యే ప్రశ్నించగా, పేదల ఆశాజ్యోతి అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం వల్ల అమలు అయ్యాయని, అలాగే మా గ్రామంలో 3 వందలకు పైగా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని తెలిపారు. గత ప్రభుత్వం ఏ ఒక్క సహాయం అందివ్వలేదని మళ్లీ తామంతా జగన్‌బాబు వెంటే నడుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు మాతా గురునాథరావు, సర్పంచ్ మల్లే లోవరాజు, రేవు పోలవరం ఉప సర్పంచ్ చోడిపల్లి గోవిందు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, అద్దేపల్లి నూకునాయుడు, చల్లపల్లి సత్యనారాయణ, దోసపాత్రుని సందీప్, ఈతకొట్టు నాగు, మల్లికార్జున, జగ్గ, ఎంపీడీవో రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

2న లక్ష్మీ నరసింహస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ



అహోబిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : పాటిపల్లి పరిధిలోని అహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ గిరి ప్రదక్షిణకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు ఆవిష్కరించారు. ఈ నెల 2వ తేదీన జరగనున్న ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా గిరి ప్రదక్షిణను విజయవంతం చేయాలన్నారు. పాటిపల్లి బీసీ కాలనీ, తోటాడ, సిరసపల్లి, నారాయుడుపాలెం మీదుగా స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తారన్నారు. అదే రోజు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఆలయకమిటీ సభ్యులు కొయిలాడ జగదీష్, సరిసా శ్రీను, ఉపేంద్ర, పోలినాయుడు, శివలంక శంకర్,స్వామి పాల్గొన్నారు.

వేడుకగా గ్రాండ్ క్రిస్మస్



డాక్టర్ డేవిడ్ మూర్ దంపతులను అభినందిస్తున్న డాక్టర్ కుమార్ ఆర్‌కె

పాయకరావుపేట : పట్టణంలోని చిత్రమందిర్ సినిమా థియేటర్ వెనుక గల ఐ ఓపెనర్స్ మినిస్ట్రీస్‌లో శుక్రవారం రాత్రి గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐ ఓపెనర్స్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ కుమార్ ఆర్ కె ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ఆస్ట్రేలియా నుంచి ఆ సంస్థ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ డేవిడ్ మూర్, గే మూర్, లైట్ ఆఫ్ లైఫ్ చర్చి ఫౌండర్ లూయిస్ ముఖ్య అతిథులుగా విచ్చేసి క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మదర్ కేర్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ రమాకుమారి ఆధ్వర్యంలో సండే స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేశారు.

రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీల్లో హరిపాలెం విద్యార్థుల ప్రతిభ

అచ్యుతాపురం(అనకాపల్లి): రాష్ట్ర స్థాయిలో ఖో-ఖో పోటీల్లో చక్కని ప్రతిభ కనభరిచి అచ్యుతాపురం మండలం హరిపాలెం ఉన్నత పాఠశాలకు చెందిన అజయ్ జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడని పాఠశాల హెచ్ఎం జగదీశ్వరరావు, పీఈటీ ధర్మిరెడ్డి రాజు తెలిపారు. ఈ మేరకు శనివారం హెచ్‌ఎంతో పాటు, ఉపాధ్యాయులు విద్యార్థుల్ని అభినందించారు. అండర్ -17 ఖో-ఖో తో పాటు, త్రో బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనభరిచిన అజయ్, కె. భరత్, అఖిల, శైలును అభినందించారు.

అవ్వా తాతలకు న్యూ ఇయర్ కానుక

- ఈ నెల నుంచి రూ.2750 చొప్పున పింఛను పంపిణీ
- కొత్తగా 1333 పింఛన్లు మంజూరు
- నేటి నుంచి పంపిణీకి అధికారుల సన్నాహాలు
- లబ్ధిదారుల్లో ఆనందం



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వృద్ధుడికి పింఛను అందజేస్తున్న వలంటీరు (ఫైల్)

నక్కపల్లి : అవ్వాతాతలకు జగనన్న సర్కారు నూతన సంవత్సరం, సంక్రాంతి కానుకగా కొత్త పింఛన్లను మంజూరు చేసింది. ఇప్పటి వరకు ఇచ్చే పింఛన్లకు అదనంగా మరో రూ.250 పెంచింది. ఈనెల నుంచి రూ.2750 చొప్పున చెల్లించాలని నిర్ణయించింది. అలాగే 65 ఏళ్లు వయసు దాటిన వారికి కొత్తగా పింఛన్లను మంజూరు చేసింది. ప్రతి ఏటా సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పింఛన్ల పెంపు, కొత్త పింఛన్ల మంజూరును ప్రభుత్వం చేపడుతోంది. దీనిలో భాగంగా పాయకరావుపేట నియోజవకర్గంలో కొత్తగా 1333 పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు

నక్కపల్లి మండలంలో 405, పాయకరావుపేట మండలంలో 386, కోటవురట్ల మండలంలో 279, ఎస్.రాయవరం మండలంలో 263, మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేశారు. వృద్ధులు, వింతతులు, వికలాంగులు, నేత కార్మికులు, గీతకార్మికులు, డప్పు కళాకారులు, చర్మ కార్మికులకు ప్రభుత్వం సామాజిక భద్రతా పథకం కింద పింఛన్లు పంపిణీ చేస్తోంది. గత ఎన్నికల ముందు అధికారంలోకి రావడం కోసం చంద్రబాబునాయుడు రెండువేల రూపాయల పింఛన్లను ఎన్నికలకు కొద్దిరోజుల ముందు పెంచారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రస్తుతం చెల్లిస్తున్న పింఛను దఫదఫాలుగా రూ.3వేల రూపాయలకు పెంచుతామని జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.250 చొప్పున పింఛను పెంచడం జరుగుతుందని ఇచ్చిన హామీ మేరకు మూడువిడతలుగా పింఛన్లను పెంచారు. జనవరి నుంచి పింఛన్లు రూ.2750లకు పెంచడం జరిగింది.

ఒకటో తారీఖున ఠంచనుగా...

గత ప్రభుత్వంలో మాదిరిగా పింఛన్ల కోసం పంచాయతీ కార్యాలయాల చుట్టు రోజుల తరబడి పడిగాపులు పడే పరిస్థితి లేకుండా ప్రతి నెలా 1వ తేదీనే వలంటీర్ల ద్వారా లబ్దిదారుకు ఇంటివద్దకే వెళ్లి పింఛను అందజేసే విధంగా చర్యలు చేపట్టింది. కొత్తగా మంజూరు చేసిన పింఛన్లను మాత్రం స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలతో సంప్రదించి పంపిణీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీనిపై ఎంపీడీవో సీతారామరాజు మాట్లాడుతూ పెంచిన పింఛన్లను ఒకటో తేదీ నుంచి యధావిధిగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.